# 16. నీరు - మీరు (సంభాషణ)

**ఉపాధ్యాయిని** : ఇవాళ మనం ప్రకృతి వనరులలో పేర్కొనదగిన నీటిని గురించి చర్చించుకొందాం. మొదట నీరు మనకు ఎన్ని విధాలుగా ఉపయోగపడుతుందో చెప్పండి?

**మేరీ** : ఉదయం లేచిన దగ్గరనుంచి స్నానానికి, తాగడానికి, వంటకు, చెట్లను పెంచడానికి ఇలా అనేకరకాలుగా ఉపయోగపడుతుంది టీచర్.

**ఉపాధ్యాయిని** : చక్కగా చెప్పావు. మరి ఇంత విలువైన నీటిని మనం ఎలా పొదుపు చేసుకోవాలో ఒక్కొక్కరుగా చెప్పండి.



**రహీం** : కొళాయిలు కారుతుంటే వెంటనే కట్టేయాలి. ఆగకుండా బొట్టు బొట్టుగా కారుతుంటే దాని కింద పాత్రను పెట్టి నీరు వృధాగా పోకుండా చూడాలి. కుళాయిని మరమ్మత్తు చేయించాలి.

**ఉపాధ్యాయిని** : శభాష్! బాగా చెప్పావు.

**డేవిడ్** : టీచర్! వానాకాలంలో మేము వాననీటిని గంగాళాలలో, బాల్చీలలో పట్టి వాటిని బట్టలుతకడానికి, ఇల్లు కడగడానికి ఉపయోగిస్తాం.

**జలజ** : టీచర్! మా కాలనీలో వర్షపు నీటిని గొట్టాల ద్వారా ఇంకుడు గుంటలోనికి పంపుతారు. దీనినే రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ అని అంటారట.

**అవని** : టీచర్! రోజూ నేను ఇంటికి వెళ్ళగానే నా నీళ్ళ సీసాలో మిగిలిన నీటిని చెట్లకు పోస్తాను.

**ఉపాధ్యాయిని** : అలాగా! మంచిది. నీటి పొదుపు గురించి చాలా విషయాలు ఎంతో బాగా చెప్పారు. కానీ కేవలం తెలుసుకోవడం మాత్రమే కాదు. వీటిని మనందరం పాటించాలి. ఇతరులుకూడా పాటించేలా ప్రోత్సహించాలి.

**''ప్రతి నీటి బిందువు నీ ఆత్మబంధువు''**

ఉ.సూ: ప్రకృతి వనరుల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి విషయాలపై చర్చ జరిపించి, విద్యార్థులను బాధ్యత గల ''హరిత సైనికులు''గా తీర్చిదిద్దాలి.